సాక్షి
మహబూబాబాద్
గురువారం । 31 । జూలై । 2025



పోలీస్ డ్యూటీ మీట్‌కు సర్వంసిద్ధం

మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌కు సర్వంసిద్ధం చేశారు.

- 8లో▸



వరుణుడి దోబూచులాట..

వానాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.4° /23.8°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సత్వరమే సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ అనిల్ కుమార్



పెద్దవంగర: ప్రజలు అందించే అర్జీలపై తక్షణమే స్పందించి, సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో తహసీల్దార్ మహేందర్ వివరాలిచ్చారు. మండల వ్యాప్తంగా 1029 దరఖాస్తులు వచ్చాయని, అందులో సాదాబైనామా మినహా వివిధ కేటగిరీలలో 191 భూ సమస్యలు పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. భూభారతిలో వచ్చిన ప్రతీదరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూ సంబంధిత పాత సమస్యలపై మరింత వేగంగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లష్కర్, జూనియర్ అసిస్టెంట్ల్ పర్వీనా, అయ్యప్పరెడ్డి, రోహిత్ రాజు, రికార్డు అసిసెంట్లు అశోక్, పాషా, తరుణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

తొర్రూరు: రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూ భారతి దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ నర్సయ్య, ఆర్ఐ నజీముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



తొర్రూరు: జాతీయ స్థాయి క్రీడల్లో స్థానిక మైనార్టీ బాలికల గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల ఢిల్లీ, మధ్యప్రదేశ్, నల్లగొండలో జాతీయ స్థాయి హాకీ, షూటింగ్‌బాల్, గాట్కా క్రీడలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్–17 విభాగంలో పాఠశాలకు చెందిన బి.నందిని (హాకీ), ఎం.నందిని, డి.అక్షయ, బి.దీక్ష(షూటింగ్‌బాల్), జి.పల్లవి, ఎండీ సమ్రీన్(గాట్కా) పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈమేరకు హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులను మైనార్టీ గురుకులాల ఉపాధ్యక్షుడు పహీముద్దీన్ ఖురేషీ, సెక్రటరీ షఫీ ఉల్లా సత్కరించారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని పాఠశాలలో ప్రిన్సిపాల్ పసునూరి వనజ విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు ఉమ, కల్యాణిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్లు నజియా తహసీన్, నుస్రత్ కౌసర్, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోనాల పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి



తొర్రూరు: బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పట్టణంలో బోనాల పండుగ నిర్వహణపై చర్చించారు. పురోహితులు ఓలేటి యాదగిరి ఆచార్యులు, స్థానిక నాయకులు చర్చించి ఆగస్టు 6న తొర్రూరులో బోనాల పండుగ జరుపుకోవాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల పండగ తెలంగాణ సంస్కృతికి నిదర్శనమని, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగ జరుపుతామన్నారు. భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పానుగోటి సోమేశ్వరరావు, పెదగాని సోమయ్య, ధరావత్ రాజేష్‌నాయక్, మంగళపల్లి రామచంద్రయ్య, చాపల బాపురెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, గుండాల నర్సయ్య, సురేందర్‌రెడ్డి, దొంగరి శంకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన పశు సంపద!

జిల్లాలో ఎట్టకేలకు పశుగణన పూర్తి

- ఐదు సంవత్సరాల క్రితం 11,85,568 పశువులు
- ప్రస్తుతం 8,40,114 పశువులు ఉన్నట్లు సమాచారం
- సంఖ్య ఆధారంగా వ్యాక్సిన్లు, మందులు, దాణా సరఫరా

మహబూబాబాద్: గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశు సంపద అత్యంత కీలకం. శాస్త్ర, సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినప్పటికీ.. దేశంలో అధిక శాతం వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయంతో పాటు పశుపోషణ అనేది కీలకంగా మారింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఐదేళ్లకోసారి పశు గణన చేపడుతోంది. దీనిలో భాగంగా గత ఏడాది అక్టోబర్‌లో ప్రారంభమైన పశుగణన ఈ ఏడాది ఫిబ్రవరిలో పూర్తి కావాలి. కానీ చాలా ఆలస్యంగా ప్రస్తుతం పూర్తి చేశారు. కాగా ఐదేళ్లక్రితంతో పోలిస్తే పశువుల సంఖ్య తగ్గినట్లు సమాచారం.



45 పశువైద్యశాలలు..

జిల్లాలో మొత్తం 45 పశు వైద్యశాలలు ఉన్నాయి. వాటిలో ఏరియా వెటర్నరీ వైద్యశాలలు (ఏవీహెచ్) 3, ప్రైమరీ వెటర్నరీ వైద్యశాలలు (పీవీసీ) 23, సబ్ సెంటర్లు 16 ఉన్నాయి. కాగా 2019లో పశుగణన చేశారు. అప్పుడు అన్ని రకాల పశువులు కలిసి 11,85,568 ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

తగ్గుదల..

జిల్లాలో గత గణనలో 11,85,568 పశువులు ఉన్నట్లు తేలింది. ప్రస్తుత గణనలో 8,40,114 పశువులు ఉన్నట్లు సమాచారం. ఈమేరకు పశువుల సంఖ్య తగ్గింది. కాగా, పశువుల సంఖ్య భారీగా తగ్గడంతో ఆసంఖ్యను జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. యాప్‌లో నమోదు చేసిన సంఖ్య తమకు కూడా తెలియదని, రాష్ట్ర ప్రభుత్వానికి వివరాలు పంపించామని, గణనపై వెరిఫికేషన్ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. గృహాలు, పశువుల సంఖ్య విషయంలో రీ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని పశువుల సంఖ్యను బహిర్గతం చేయవద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే పశుగణన వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తుందని, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం వెల్లడిస్తుందని చెబుతున్నారు.

మందులు, దాణా..

పశుగణనలో తేలిన సంఖ్య ఆధారంగా వ్యాక్సిన్లు, మందులు, దాణా సరఫరా అవుతుంది. వ్యాధులు, హైరిస్క్ ప్రాంతాలకు వ్యాక్సిన్లు, మందులు అదనంగా సరఫరా అవుతాయని అధికారులు పేర్కొన్నారు. పశువుల సంఖ్య తగ్గితే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయా లేదా ఏదైనా సమస్య ఉందా.. తెలియదు కానీ గణన పూర్తి చేసిన తర్వాత సంఖ్యను బహిర్గతం చేయడం లేదు.

ప్రస్తుతం గణన పూర్తి..

జిల్లాలో 23 మంది డాక్టర్లు సూపర్ వైజర్లుగా, 76 మంది గోపాల మిత్రలు, పారాస్టాఫ్ ఎన్యుమరేటర్లుగా పశుగణన చేపట్టారు. డాక్టర్లు గణనను పర్యవేక్షించారు. ప్రతీ ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి పశువుల సంఖ్య తెలుసుకొని ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. పశువులతో పాటు రైతు పేరు, ఇంటి నంబర్, ఫోన్ నంబర్ ఇతర వివరాలు తెలుసుకొని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేశారు.



జిల్లాలో పశుగణన చేస్తున్న ఎన్యుమరేటర్లు (ఫైల్)

సంఖ్య గోప్యంగానే ఉంటుంది

జిల్లాలో పశుగణన పూర్తయింది. కానీ యాప్‌లో నమోదు చేయడం వల్ల ఆ సంఖ్య తెలియదు. సంఖ్య బహిర్గతం చేయవద్దని ఆదేశాలు ఉన్నాయి. గణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రీ వెఫికేషన్ చేస్తుంది. తర్వాత వివరాలు కేంద్రానికి పంపిస్తారు. కేంద్రం రెండు నెలల తర్వాత పశువుల సంఖ్య జిల్లాల వారీగా ప్రకటిస్తుంది. రాష్ట్రం మొత్తం ఇదే పరిస్థితి ఉంది.

- డాక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

నాయకులు బహూకరించిన కరవాలాన్ని ప్రదర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



మానుకోటను కాషాయకోటగా మార్చాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి మానుకోటను కాషాయకోటగా మార్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో మానుకోట గడ్డపై బీజేపీ జెండాను ఎగురవేయాలని కోరారు.

- సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్

- 8లో▸

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భూపోరాట కేసుల్లో భాగంగా కోర్టుకు హాజరైన సీపీఎం నేతలు అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం మాట్లాడారు. గుడిసె వేసుకుని జీవిస్తున్న పేదలకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అక్రమంగా నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బానోత్ సీతారాంనాయక్, రావుల రాజు, తోట శ్రీనివాస్, బూర్గుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీలోని పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయం, జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకాధికారులు హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, శానిటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ పరిశీలించాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భోధన చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణవేణి ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

మహబూబాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు త్వరగా మార్కింగ్ చేసుకుని బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విపత్తుల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, అనిల్‌కుమార్, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

సద్వినియోగం చేసుకోవాలి

ఆధునిక సాంకేతికతపై యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏటీసీకి సంబంధించిన ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఏటీసీలో ఈ సంవత్సరం తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, కళాశాల ప్రిన్సిపాల్ బాబు, శిక్షణాధికారి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.


వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉండాలి

- అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

గార్ల: వైద్యులు, వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. కొంతమంది వైద్యులు ఎందుకు విధులకు హాజరు కాలేదని డ్యూటీలో ఉన్న డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అందరూ కచ్చితంగా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఏడాది క్రితం పోస్టుమార్టం గది నిర్మించారని, ఇక్కడే మృతదేహాల పోస్టుమార్టం నిర్వహించాలని సీపీఎం జిల్లా, మండల నాయకులు అడిషనల్ కలెక్టర్‌కు విన్నవించారు.

బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ..

గార్లలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల వసతిగృహంలోని కిచెన్‌షెడ్, సరుకుల స్టోర్‌రూంలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన వేడివేడి ఆహారం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీటీ సంజీవ, పంచాయతీ కార్యదర్శి అజ్మీరా కిషన్ తదితరులు ఉన్నారు.




ఆస్పత్రిలో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

సమర్థవంతంగా నేర పరిశోధనలు

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ అందుబాటులోకి రావడంతో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి మరింత సమర్థవంతంగా, వేగవంతంగా నేర పరిశోధనలు చేయడం సాధ్యమవుతుందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖకు కేటాయించిన మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను ఎస్పీ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంతకుముందు జిల్లాస్థాయిలో ప్రాంతీయ ప్రయోగశాల అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు ప్రక్రియలో కొన్ని పరిమితులు ఉండేవన్నారు. ప్రస్తుతం మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ ద్వారా నేర స్థలాలకు వెంటనే చేరుకుని, ఆధారాలను సేకరించడానికి వీలు ఉంటుందన్నారు. దర్యాప్తులో వేగం, కచ్చితత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ సత్యనారాయణ, ఆర్ఐ భాస్కర్, ఫింగర్ ప్రింట్ ఎస్సై శివకుమార్ పాల్గొన్నారు.



మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

వేగంగా.. సులువుగా..

భక్తులు వనదేవతలను దర్శించుకునేలా సమాలోచనలు

- మేడారంలో పూజారులతో కలిసి గద్దెల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్
- పూజారులదే ఫైనల్ నిర్ణయం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనం భక్తులకు సులువుగా కల్పించేందుకు అధికారులు, పూజారులు సమాలోచనలు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, డీఎస్పీ రవీందర్, ఈఓ వీరస్వామి, సమ్మక్క– సారలమ్మ, గోవిందరాజు, పగిడ్దిరాజుల పూజారులతో కలిసి అమ్మవార్ల గద్దెల ప్రాంగణాన్ని సందర్శించారు. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను వరుస క్రమంలో చేయడం వల్ల భక్తులకు సులువుగా దర్శనం కలుగుతుందన్న ఆలోచనపై పూజారులతో చర్చించారు. ఆర్కిటెక్ట్ బృందం రూపొందించిన మాస్టర్‌ప్లాన్, అధికారులు తయారు చేసిన మ్యాప్‌లను పూజారులకు కలెక్టర్ వివరించారు.

అంతిమ నిర్ణయం పూజారులదే..

ఆర్కిటెక్ట్ బృందం రూపొందించిన మాస్టర్‌ప్లాన్ వల్ల అమ్మవార్ల దర్శనంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తుతాయనే అభిప్రాయాన్ని పూజారులు అధికారులకు వివరించారు. కానీ, అధికారులు సమ్మక్క–సారలమ్మ గద్దెల పక్కన వరుస క్రమంలో గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను ఉంచడంపై పూజారులు సమాలోచనతో సానుకూల నిర్ణయానికి వచ్చారు. సారలమ్మ ఎంట్రెన్స్ గేట్‌ను సుమారుగా 20 ఫీట్ల దూరం విస్తరించి వరుస క్రమంలో గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని పూజారులు కొంత మేరకు ఏకీభవించారు. నలుగురు దేవతలు వరుస క్రమంలో ఉండడం వల్ల టీటీడీ కల్యాణ మండపం ద్వారా, ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్ ద్వారా వచ్చే భక్తులకు రెండు వైపులా దర్శనం సులువుగా ఉంటుందని భావిస్తున్నారు. అదేవిధంగా రెండు వైపులా క్యూలైన్‌ల ద్వారా గద్దెల ప్రాంగణంలోకి వచ్చిన భక్తుల్లో ఒకేసారి పదిమంది వెళ్లేలా వెడల్పాటి మరో క్యూలైన్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వివరించారు. కాగా, గద్దెల మార్పుపై రెండు మూడు రోజుల్లో పూజారులతో చర్చించి అభిప్రాయాన్ని వెల్లడిస్తామని గోవిందరాజు పూజారి.. అధికారులకు తెలిపారు.

మొక్కుల చెల్లింపులో ఇబ్బంది లేకుండా..

అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, ఒడిబియ్యం, కానుకల చెల్లింపులో భక్తులు ఇబ్బందులు పడకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా అధికారులు పరిశీలించారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజును వరుస క్రమంలో భక్తులు దర్శనం చేసుకునే సమయంలో పూజారులు సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద క్యూలైన్ లోపల ఉండి భక్తులు సమర్పించిన ఎత్తు బంగారం తీసుకుని తిరిగి ప్రసాదం అందించడంతోపాటు మొక్కు బంగారాన్ని ఎప్పటికప్పుడు బయటకు తరలించే మార్గాలను పరిశీలించారు. నాలుగు గద్దెలు వరుస క్రమంలో ఉంటే వీవీపీ, వీవీఐపీల దర్శనం సమయంలోనూ సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా వీవీఐపీలు అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం నేరుగా హెలిపాడ్ ప్రదేశానికి వెళ్లేలా సారలమ్మ ఎగ్జిట్ గేట్‌నుంచి ఐరన్‌తో ఫ్లైవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే మరింత సులువుగా ఉంటుందని సమాలోచన చేశారు. పూజారులు తమ నిర్ణయాన్ని త్వరగా తెలిపితే పదిహేను రోజుల్లో పనులు మొదలు పెడతామని కలెక్టర్ దివాకర టీఎస్ చెప్పారు.



అధికారులు, పూజారులతో కలిసి గద్దెల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

షెడ్యూల్ ప్రకారం దర్శనం పాస్‌లు..

ఈసారి మహాజాతరలో షెడ్యూల్ ప్రకారం వీఐపీ, వీవీఐపీలు, అధికారులు, మీడియాకు దర్శనం పాస్‌లు జారీ చేయాలనుకుంటున్నారు. అందరికీ ఒకేసారి పాస్‌లు జారీ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈసారి జాతరకు ముందుగా నాలుగైదు తేదీల్లో పాస్‌లు జారీ చేయడంతో ఇబ్బందులు తప్పుతాయని అధికారులు భావిస్తున్నారు. జాతర నాలుగు రోజుల్లో ఎమ్మెల్యే, ఆపైస్థాయి వారికి పాస్‌లు జారీ చేసే ఆలోచన చేస్తామని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా సమ్మక్క మ్యూజియం, సారలమ్మ ఎంట్రెన్స్‌నుంచి జంపన్నవాగు ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు దారిని విస్తరించాలని పూజారులు కలెక్టర్‌ను కోరారు. కాగా, రోడ్డును కూడా కలెక్టర్..ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

తీజ్ పండుగను ఘనంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: తీజ్ పండుగను బంజారాలు ఘనంగా నిర్వహించుకోవాలని డాక్టర్ నెహ్రూనాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ వెంకన్ననాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సేవాలాల్ సేన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఉన్న 16 కోట్లకు పైగా ఉన్న బంజారాలు అందరూ ఒకే భాష, ఒకే సంస్కృతి, సంప్రదాయాలు పాటిస్తున్నారని, ఆగస్టు మొదటి శుక్రవారం మొదలుకుని పదో రోజు కథావో ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. సంఘం నాయకులు మాలోత్ సురేష్, డాక్టర్ వీరన్న, భుక్యా ప్రవంతి, రాంబాబు, బోడ రమేష్, బాదావత్ సురేష్, బాబులాల్, సురేష్, రాజ్‌కుమార్, స్వాతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దంతాలపల్లి: రైతులు పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధిస్తారని డీఏఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఆగపేట గ్రామంలో బుధవారం పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల వల్ల పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని, రైతులు గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొక్క దశ నుంచి రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ వాహిని, టెక్నికల్ ఏఓలు శ్రీదేవి, రాజు, ఏఈఓలు దీక్షిత్, ఉదయ్‌కిరణ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



దంతాలపల్లి: పత్తి చేనులో గుంటుక తోలుతున్న డీఏఓ శ్రీనివాసరావు

ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలి

నెల్లికుదురు: ఎరువుల షాపుల ఎదుట ఎరువుల నిల్వలు, ధరల పట్టిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఏడీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఎరువుల షాపులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ఏఓ షేక్ యాస్మిన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

భద్రకాళి ఆలయంలో నిత్యాన్నదాన టోకెన్ల పెంపు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి దేవాలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదానం టోకెన్ల సంఖ్యను పెంచుతూ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఎంఎండీ కృష్ణవేణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిత్యాన్నదానంలో భాగంగా.. భక్తులకు రోజూ 200 టోకెన్లు ఇస్తుండగా.. ఇక నుంచి 300 మంది సభ్యులకు ఇవ్వనున్నారు.

శుక్రవారం, ఆదివారం ఇప్పటివరకు 300 టోకెన్లు ఇస్తుండగా.. 500 మందికి టోకెన్లు ఇవ్వనున్నారు. దేవాలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా నిత్యాన్నదానం టోకెన్ల సంఖ్య పెంచాలని పలుమార్లు దేవాదాయశాఖకు విజ్ఞప్తి చేసినట్లు ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు.

క్లుప్తంగా

6న మెగా జాబ్‌మేళా

ఏటూరునాగారం: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆగస్టు 6న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డీఫార్మ్, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివిన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించనున్నామన్నారు. ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌లో 6వ తేదీన ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరుకావాలని కోరారు. మరింత సమాచారం కోసం 9490341911, 8008932159 నంబర్లను సంప్రదించాలన్నారు.

వరద తగ్గుముఖం..

కాళేశ్వరం: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద తగ్గుతోంది. బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద 2.89 లక్షల క్యూసెక్కుల వరద తరలివచ్చింది. అదేస్థాయిలో బ్యారేజీలోని మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. గోదావరి, ప్రాణహితల ద్వారా సోమవారం 5.12లక్షల క్యూసెక్కులు తరలొచ్చిన విషయం తెలిసిందే.

కార్మిక హక్కులను హరిస్తున్న పాలకులు

- ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి అశోక్ ఓంకార్

రామన్నపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరిస్తూ పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తున్నాయని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. బుధవారం వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మహబూబ్ పాషాతో పాటు పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి అశోక్ ఓంకార్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌పోర్ట్ రంగం కార్మిక వర్గాన్ని ఆదుకునేలా హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర క్షేత్రాల దర్శన యాత్ర


యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విఘ్నేష్ జీ

నయీంనగర్: పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ జీ తెలిపారు. బుధవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ యాత్ర సెప్టెంబర్ 9న ప్రారంభమవుతుందన్నారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్లగొండ, హైదరాబాద్, కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందని పేర్కొన్నారు. ఈ యాత్ర 15 రోజులు జరగనుందని తెలిపారు. ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధపూర్, మధుర, అయోధ్య, ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ పుణ్యక్షేత్రాలు కవర్ చేస్తామని తెలిపారు. టికెట్లను 93550 21516 ఫోన్‌నంబర్‌కు కాల్ చేసి బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. యాకేశ్, సంతోష్ ఉన్నారు.

వరుణుడి దోబూచులాట..

ఉమ్మడి వరంగల్‌లో వర్షపాతం సాధారణమే..
- జనగామ జిల్లాలో లోటు
- ఇతర జిల్లాల్లో సాధారణం
- ఊపందుకున్న పంటల సాగు


హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నాగారంలో నాటు వేస్తున్న వ్యవసాయ కూలీలు


నారు పంచుతున్న మహిళ

హన్మకొండ: వర్షాకాలం ఉమ్మడి వరంగల్ జిల్లాను దోబూచులాడుతోంది. కురువాలా? వద్దా అని ఆలోచిస్తున్నట్లు అనిపిస్తోంది. వరుసగా ఆరు రోజులు వర్షాలు కురిసినా సాధారణాన్ని మించలేదు. కొన్ని ప్రాంతాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. సోమవారం నుంచి శనివారం వరకు వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో తేలిక నుంచి మోస్తరుగా కురువగా, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అయినా లోటు తీరలేదు. ఈ వర్షంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధానంగా వరి నాట్లు ఊపందుకున్నాయి. ఈ వర్షం కురిసే వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 21 నుంచి 24 వరకు కురిసిన వర్షాలు రైతుల్లో సంతోషాన్ని నింపాయి. అయితే చెరువులు, కుంటల్లోకి పూర్తి స్థాయిలో నీరు చేరలేదు. కాగా, ఈ నెల 30 వరకు జనగామ జిల్లాలో లోటు వర్షపాతం నమోదు కాగా, ఇతర జిల్లాలో సాధారణంగా నమోదైంది.

ములుగు జిల్లాలో సాధారణమే..

ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురిసినా సాధారణాన్ని మించలేదు. వర్షాకాలంలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 567.3 మిల్లీ మీటర్లుగా కాగా ఇప్పటి వరకు 552.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ములుగు, కన్నాయిగూడెం, వాజేడు మండలాల్లో లోటుగా ఉంది. ఏటూరునాగారం, వెంకటాపురం, మల్లంపల్లి మండలాల్లో సాధారణానికి మించి కురిసింది. మిగతా మండలాల్లో సాధారణంగా నమోదైంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 470.2 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 393 మిల్లీ మీటర్లు కురిసింది. మహదేవపూర్, కాటారం, ఘన్‌పూర్ (ములుగు), కొత్తపల్లి గోరిలో లోటు, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

మహబూబాబాద్ జిల్లాలోనూ అంతే..

మహబూబాబాద్ జిల్లాలోనూ సాధారణంగా నమోదైంది. వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 386.3 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 379.9 మిల్లీ మీటర్లు నమోదైంది. మహబూబాబాద్, దంతాలపల్లి, తొర్రూరు మండలాల్లో లోటు, బయ్యారం, గార్ల మండలాల్లో సాధారణానికి మించి వర్షం కురిసింది. మిగతా మండలాల్లో సాధారణంగా నమోదైంది.

జనగామ జిల్లాలో లోటు..

జనగామ జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 322.2 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 244.9 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. జిల్లాలోని జఫర్‌గఢ్, స్టేషన్ ఘన్‌పూర్, రఘునాథపల్లి, లింగాలఘణపురం, పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జనగామ, తరిగొప్పుల, చిల్పూరు, దేవరుప్పుల, నర్మెట, బచ్చన్నపేట మండలాల్లో సాధారణంగా కురిసింది.

హనుమకొండ జిల్లాలో సాధారణం..

హనుమకొండ జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు 400.3 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం కాగా ఇప్పటి వరకు 372.8 మిల్లీ మీటర్లు కురిసింది. ఎలకతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు మండలంలో లోటు, మిగతా మండలాల్లో సాధారణంగా కురిసింది.

వరంగల్ జిల్లాలోనూ అంతే..

వరంగల్ జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 421.5 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 423.8 మిల్లీ మీటర్లు కురిసింది. రాయపర్తి, ఖిలావరంగల్ మండలంలో లోటు, చెన్నారావుపేట మండలంలో ఎక్కువ, ఇతర మండలాల్లో సాధారణంగా కురిసింది.

జిల్లా వారీగా ప్రధాన పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)..

జిల్లా	వరి		మొక్కజొన్న	
	సాధారణం	సాగైంది	సాధారణం	సాగైంది
వరంగల్	1,27,950	52,104	10,180	11,085
హనుమకొండ	1,41,984	69,051	4,483	7,080
మహబూబాబాద్	2,03,909	62,504	45,390	55,600
ములుగు	99,628	42,504	1,332	7,127
జేఎస్ భూపాలపల్లి	1,08,106	4,231	179	245
జనగామ	1,96,799	80,905	3,342	7,976

జిల్లా	పత్తి	
	సాధారణం	సాగైంది
వరంగల్	1,29,343	1,15,960
హనుమకొండ	92,028	74,849
మహబూబాబాద్	89,219	77,882
ములుగు	24,513	19,371
జేఎస్ భూపాలపల్లి	99,948	98,260
జనగామ	1,45,812	1,02,423

ఊపందుకున్న పంటల సాగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటల సాగు ఊపందుకుంది. సాధారణాన్ని మించి పంటల సాగైంది.

- వరంగల్ జిల్లాలో అన్ని పంటలు కలిపి మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 2,84,375 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,79,338 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 1,79,884 ఎకరాల్లో సాగైంది.
- హనుమకొండ జిల్లాలో సాధారణ సాగు మొత్తం 2,43,357 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,08,900 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1,51,383 ఎకరాల్లో సాగైంది.
- మహబూబాబాద్ జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 3,52,531 కాగా ఇప్పటి వరకు 1,94,997 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 2,08,878 ఎకరాల్లో సాగైంది.
- ములుగు జిల్లాలో అన్ని పంటలు కలిపి మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 1,26,973 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 90,318 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 96,264 ఎకరాల్లో సాగైంది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 2,12,415 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,94,452 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 1,09,457 ఎకరాల్లో సాగు చేశారు.
- జనగామ జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 3,63,104 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2,38,499 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 2,03,452 ఎకరాల్లో సాగు చేశారు.
- అన్ని పంటలు కలిపి సాధారణంగా ఇప్పటి వరకు సాగైనా విస్తీర్ణం చూస్తే వరంగల్ జిల్లాలో 63.26 శాతం, హనుమకొండ జిల్లాలో 62.21, మహబూబాబాద్ జిల్లాలో 59.25, ములుగు జిల్లాలో 54.55, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 51.53 శాతం, జనగామ జిల్లాలో 56.03 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

ఉమ్మడి వరంగల్‌లో ప్రధాన పంటల సాగు వివరాలు..

ప్రధాన పంటలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం 8,78,376 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2,76,849 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 3,11,379 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం మొత్తం 64,906 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 50,536 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 89,113 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి మొత్తం సాధారణ విస్తీర్ణం 5,79,863 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 5,78,468 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 4,88,745 ఎకరాల్లో సాగైంది.

పత్తికి పొంచి ఉన్న ప్రమాదం!

- వర్షాలతో పంటలో వడలు తెగులు వచ్చే అవకాశం..
- సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి
- రైతులకు మల్యాల కేవీకే శాస్త్రవేత్త అశ్విని సూచనలు


మల్యాల కేవీకే శాస్త్రవేత్త డి.అశ్విని

మహబూబాబాద్ రూరల్ : పత్తికి ప్రమాదం పొంచి ఉంది. వర్షాలతో పంటలో వడలు తెగులు వచ్చే అవకాశం ఉంది. దీనిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో మొక్కలు వడలిపోయి చనిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి.అశ్విని రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

వడలు తెగులు (పారా విల్ట్)..


పత్తి మొక్కలను ఆశించిన వడలు తెగులు

వర్షాలు ఎక్కువ కురిసి, మురుగు నీరు వెళ్లే సౌకర్యం లేనప్పుడు, నీరు ఆగిన పొలంలో వడలు తెగులు ఎక్కువ ఆశించే అవకాశం ఉంది.

కారణాలు: పత్తి చేనులో నీరు నిల్వ ఉండడం వల్ల వేరులకు గాలి అందక వేరు వ్యవస్థ దెబ్బతింటుంది. దీనివల్ల వేరు భూమిలో నీరు ఉన్నప్పటికీ తీసుకోలేక మొక్కలు వడలి పోతాయి. దీనికిగాను భూమిలో ఉన్న అనేక శిలీంద్రాలు వేరును ఆశిస్తుంది.

లక్షణాలు : తెగులు ఆశించిన సందర్భంలో అన్ని ఆకులు వడలిపోతాయి. తర్వాత ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోతాయి. మొక్కలు పూత, కాత సమయంలో ఎక్కువ వర్షం కురిసి ఇలాంటి పరిస్థితులు ఉంటే ఎక్కువ మొక్కలు వడలు తెగులు లక్షణాలు చూపిస్తాయి. ఆకులు రాలిపోవడం, మొక్కలు ఉన్న కాయలు పగిలిపోవడం వడలు తెగులు ముఖ్య లక్షణం.

నివారణ : వడలు తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే పొలం నుంచి నీటిని తీసివేయాలి. మొక్క మొదళ్ల చుట్టూ మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ వేరు బాగా తడిసేలా పోసుకోవాలి. మొక్క పోషకాలు తీసుకోలేదు. అందుకే పైనుంచి 10 గ్రాముల పాలీ ఫీడ్ లేదా 10 గ్రాముల మల్టీ కే శిలీంద్రనాశినితో కలిపి పిచికారీ చేసుకోవాలి. బోదె సాళ్ల పద్ధతిలో పంట వేసుకుంటే ఈ తెగులు సమస్య తక్కువ ఉంటుంది.

పోలీస్ డ్యూటీ మీట్‌కు సర్వం సిద్ధం..


పోలీస్ డ్యూటీ మీట్‌కు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్త, అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్
- పీటీసీ గ్రౌండ్‌లో పోలీసుల మాక్ పరేడ్

మామునూరు/వరంగల్ క్రైం: వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో గురువారం తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ -2025 ప్రారంభంకానుంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు మూడు రోజులు పాటు జరిగే పోలీస్ డ్యూటీమీట్‌కు సర్వం సిద్ధం చేశారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్త, అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ ముఖ్య అతిథులుగా హాజరై ఉదయం 10 గంటలకు పీటీసీ పరేడ్ గ్రౌండ్‌లో డ్యూటీ మీట్‌ను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) సన్‌ప్రీత్ సింగ్ బుధవారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. అతిథులకు గౌరవవందనం సమర్పించేందుకు జిల్లా పోలీసులు మాక్ పరేడ్ నిర్వహించగా.. సీపీ స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే ఉమ్మడి పది జిల్లాల నుంచి చేరుకున్నా అధికారులు, పోలీస్ సిబ్బందిని ఒకే చోటుకు చేర్చడానికి పీటీసీ వేదిక మారింది. డ్యూటీ మీట్‌కు ఏడు పోలీస్ జోన్లతోపాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లు, సీఐడీ ఇంటెలిజెన్స్, యాంటీ నార్కొటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ వింగ్ విభాగాలకు చెందిన సుమారు వెయ్యి మందికి పైగా అధికారులు, సిబ్బంది హాజరై సైంటిఫిక్ ఎయిడ్ టు ఇన్వెస్టిగేషన్, యాంటి సబటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్‌స్క్వాడ్ కాంపిటీషన్, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫీ, వీడియోగ్రఫీకి సంబంధించిన 25 విభాగాల్లో పోటీ పడనున్నారు. ఆగస్టు 2న సాయంత్రం జరిగే ముగింపు సమావేశంలో వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలు, చాంపియన్ ట్రోఫీలు అందజేస్తారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెంట పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. కాగా, గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ జోన్ పోలీస్ డ్యూటీమీట్‌కు వేదికైంది. ప్రస్తుతం రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌కు వేదికైంది.

రూ.60 లక్షల టోకరా..

- కేశవాపురంలో చిట్టీల పేరుతో మోసం
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్ ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

వెంకటాపురం (ఎం) : ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలం కేశవాపురం గ్రామంలో అనుమతి లేకుండా చిట్టీలు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి గ్రామస్తుల నుంచి సుమారు రూ.60 లక్షలు వసూలు చేసి వారికి ఎగనామం పెట్టాడు. సదరు వ్యక్తి నుంచి డబ్బులు ఇప్పించాలని కోరుతూ సుమారు 47 మంది బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం మల్లక్కపేటకు చెందిన ఓ వ్యక్తి 25 ఏళ్ల క్రితం కేశవాపురం గ్రామానికి వలస వచ్చి టైలర్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. టైలర్ వృత్తితోపాటు అక్రమంగా చిట్టీలు నిర్వహిస్తున్నాడు. ఎత్తుకున్న వారికి సకాలంలో చిట్టీ డబ్బులు చెల్లించడంతో గ్రామస్తులు నమ్మారు. దీంతో ఒకరికి తెలియకుండా ఒకరు సదరు టైలర్‌కు రూ.60లక్షలకు పైగా చిట్టీల డబ్బులు చెల్లించారు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం సదరు వ్యక్తి గ్రామంలోని తన ఇంటిని అమ్మి వెళ్తుండగా బాధితులు నిలదీశారు. అయితే అందరికీ డబ్బులు చెల్లిస్తానంటూ బాధితులను నమ్మించాడు. ఇప్పటివరకూ ఇవ్వకపోవడంతో విసిగివేసారిన బాధితులు తమకు డబ్బులు ఇప్పించాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై చల్ల రాజును వివరణ కోరగా ఈ అంశం సివిల్ కేసుకు సంబంధించిందని, దీనిని కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించినట్లు వెల్లడించారు. తమకు బాధితులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో బాధితులు కంచు రవి, బొంకూరి అశోక్, సల్పాల కోమల, భాషవేని సాంబయ్య, సమ్మయ్య, అరుణ, చిన్న ఐలుమల్లు, ఎల్లమ్మ, సమ్మక్క, ఒదెలు, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మానుకోటను కాషాయకోటగా మార్చాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్కార్ కాదు.. ఉత్తుత్తి భాస్కర్ అవార్డు ఇద్దాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, వేదికపై ధర్మారావు, ప్రేమేందర్‌రెడ్డి, సీతారాంనాయక్ తదితరులు

సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి మానుకోటను కాషాయకోటగా మార్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మగుడిలో పూజలు చేసిన అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీఆర్ఎస్ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఆ పార్టీ ఢిల్లీ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పొగడడం హాస్యాస్పదం.. ఆయనకు ఆస్కార్ అవార్డు కాదు..ఓ సినిమాలో హాస్యనటుడు బ్రహ్మానందానికి ఇచ్చిన ఉత్తుత్తి భాస్కర అవార్డు ఇద్దాం' అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో బీజేపీ సత్తా చాటిందని, ఇప్పుడు ఈ గాలి దక్షిణ తెలంగాణకు వీస్తోందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తామనే ధీమా వ్యక్తం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. కానీ, బీసీల పేరిట ముస్లింలకు 10శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సరిపడ యూరియా సరఫరా చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృత్రిమ కొరతను సృష్టించి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిది ఒకటే డీఎన్ఏ అన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని పార్టీ నాయకులు గజమాలతో సన్మానించారు. బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్, పట్టణ నాయకులు, 60మంది నాయకులు బీజేపీలో చేరారు. కాగా, బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో న్యాయవాదులతో రామచందర్‌రావు కాసేపు ముచ్చటించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ధార్మిక పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సూర్యప్రకాశ్, రాష్ట్ర నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, తలింగాల సుధీర్‌రెడ్డి, వద్దిరాజు రామచందర్‌రావు, యాప సీతయ్య, రాచకొండ కొమురయ్య, వైవీరావు, బైరెడ్డి ప్రభాకర్, శ్యామ్‌సుందర్ శర్మ, గోవర్ధన్, ధర్మారెడ్డి, భూక్య సంగీత, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై దాడి ఘటనలో నేరస్తుడికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్ : ప్రేమించమని వేధింపులకు గురి చేయగా బాలిక నిరాకరించడంతో ఆమెపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నేరం రుజువుకావడంతో నగరంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన నేరస్తుడు బస్కే నిఖిల్ అలియాస్ డ్యానికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నమ్ బుధవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందాదేవి కథనం ప్రకారం.. నగరంలోని అబ్బనికుంటకి చెందిన ఓ బాలిక ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సమయంలో బస్కే నిఖిల్ తనను ప్రేమించాలని వేధించేవాడు. బాలిక ఈ విషయాన్ని తన తండ్రికి తెలపడంతో నిందితుడిని మందలించాడు. అనంతరం సదరు బాలిక 2020, జూన్17న తన చెల్లితో కలిసి ఇంట్లో ఉన్న సమయంలో నిఖిల్ ఇంట్లో చొరబడి ప్రేమిస్తావా లేదా అని భయభ్రాంతులకు గురి చేశాడు. దీనికి బాలిక ఒప్పుకోకపోవడంతో మద్యం సీసాతో విచక్షణరహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక.. కేకలు వేయగా అటువైపుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించాడు. దీంతో నిఖిల్ పారిపోయాడు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు బస్కే నిఖిల్ అలియాస్ డ్యానికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నమ్ తీర్పులో పేర్కొన్నారు. కేసును సీఐ రమేశ్, ఎస్సై సతీశ్ చందర్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ కె.హరికృష్ణ, భరోసా లీగల్ ఆఫీసర్ చుక్క నీరజ పర్యవేక్షణలో సాక్షులను కానిస్టేబుల్ దొడు ప్రతాప్, సదానందం కోర్టులో ప్రవేశపెట్టారు.

క్రమశిక్షణతోనే అత్యున్నత స్థాయికి..

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చాన్స్‌లర్ వరదారెడ్డి

హసన్‌పర్తి : క్రమశిక్షణతోనే అత్యున్నత స్థాయికి చేరుకుంటారని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ ప్రవేశం పొందిన బీటెక్ విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విజయం కోసం సులువు మార్గాలు ఉండవన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే లక్ష్యం సాధ్యమన్నారు. యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ నాలుగేళ్ల విద్యాకాలంలో స్వీయ అభివృద్ధి-స్వీయ పరిచయంపై దృష్టిసారించాలన్నారు. కరికులం సంస్కరణలు, పరీక్ష విధానంలో మార్పులు, ఎలక్టివ్ ఛాయిస్‌లు, గేమిఫికేషన్, మెంటరింగ్ విధానాల గురించి వివరించారు. ఎస్సార్ యూనివర్సిటీలో ఓపెన్ డోర్ పాలసీ అమలులో ఉందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ వి.మహేశ్, డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్, డైరెక్టర్లు శేషగిరావు, శరత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొగత వద్ద పర్యాటకుల సందడి..


జలపాతం వద్ద పర్యాటకులు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద బుధవారం పర్యాటకులు సందడి చేశారు. ఈ సందర్భంగా ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఎంజాయ్ చేశారు. కాగా, ఇటీవల వర్షాలు విస్తారంగా కురువడంతో జలపాతం ఉధృతంగా ప్రవహించింది. దీంతో అధికారులు జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ క్రమంలో ప్రవాహం తగ్గడంతో పర్యాటకులను నిబంధనల మేరకు అనుమతిస్తున్నారు. దీంతో జలపాతానికి పర్యాటకులు తరలొచ్చారు. పర్యాటకుల ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతే సిబ్బంది లోపలికి పంపిస్తున్నారు.